# గాలివాన

## (పాటకథ)

గాలివాన వచ్చి పంటల్ని గట్టులమీద కెక్కిస్తే ఇళ్లు కూలిపోయి, ఒళ్ళు తలక్రిందులై వళ్ళూ ఊళ్ళూ ఏకమై పోయి, సెలయేళ్ళు మహానదులై, కొండవాగులు గోదావరీ నదులై మేఘాలే భూమికి దిగివచ్చి, ప్రపంచంలోని సముద్రాలన్నీ ఎత్తివచ్చి, శివాలెత్తి, పరవళ్లెత్తి, అవన్నీ అంబరము హత్తుకుపోయి ప్రళయరుద్రుడు తాండవముచేస్తే, కాలరుద్రుడు గంతులువేస్తే, విలయరుద్రుడు వీరాంగం ఆడితే విరుచుకుపడింది — తుపాను విశాఖపట్నం జిల్లాపైనా, తందానా!

ఈ మహాప్రళయం మధ్యనే కారుపల్లిగ్రామం, గ్రామంమధ్యన భైరి అప్పలస్వామియిలు. అప్పలస్వామి ఆరితేరినరైతు. అన్నమాట నిలబెట్టుకొనే దిట్టరి. అసలయిన కాపు. సిసలైన గుణాలవాడు తందానా!

గడపదాటి పైకి కాలుపెట్టిన అప్పలస్వామికళ్ళకి ప్రత్యక్షంఅయ్యాయి—పడిపోయిన పంటలూ, పాడైపోయిన చేలూ, కూలిపోయినగోడలు, కొట్టుకుపోయినఊళ్లు, గోల పెడుతున్న ప్రజలు, తందానా తాన తందానా!

ఇళ్ళులేవు, వాకిళ్ళులేవు, గృహాలు పడిపోతే దేహాలు వదిలేసినవాళ్ళు, వరదల్లో కొట్టుకుపోయినవారు, ఇదివరదాకా ఉన్న సగంకాటకంతో ఎండిపోయారు జనులు. ఈ ప్రళయం

దివాలాతీసినవాళ్ళయింట్లో దొంగలుపడ్డట్టయింది తందానా తానా, తానా తందానా తానా!

అన్నీ చూసిన అప్పలస్వామి తన పెద్దగాదెలు తలుపులు లాగిపారేశాడు. గుండిగల్లో వంటలు పెట్టించాడు. అండిగల్లో కూరలు వండించాడు. పాత్రల్లో పప్పులూ, బానల్లో పులుసులూ వండించాడు. బీదామాత్రమేకాదు. సాదామాత్రమే కాదు, అందరికీ, ఆబాలగోపాలానికి కొద్దివారికీ గొప్పవారికీ ముసలివారికీ, ముతకలకీ, బిడ్డలకీ, పెద్దలకీ, ఆడవారికీ అష్టాదశవర్ణాలకీ అన్నమోరామచంద్రా అని వచ్చినవారందరికీ, సిగ్గుబడినా, మొహమాటంపడినా అందరికీ అన్నివిధాలా కనుక్కుని కాశీకాన్నదాతలా పెట్టాడండీ తానా, తానా, తందానా తందాన తానా!

## 2

కామమ్మ అప్పలస్వామికూతురు అందాలబరిణ, అనురాగాలపోగు పెద్దరయితుఅవడంచేత ఊళ్ళో పంతుల్నిపెట్టి చెప్పించాడు చదువు. విజయనగరం పంపించాడు పెద్దచదువుకు. తన చారడేసికళ్ళతో చూసిన పుస్తకం తప్పకుండా హృదయగతం. గులాబిపువ్వుపుటాలల్లా ఉన్న చెవులతోవిన్నపాఠం బుద్ధిగతం. నవ్వితే నవరత్నాలు ఒలుకుతవి; నవకుసుమాలు వర్షాలుకురుస్తవి. తన తీయనికంఠంతో పాటపాడిందా గోవులు కదలవు. ఆవుదూడలు మెదలవు. నాగులు ఆడతాయి. వాగులు నృత్యంచేస్తవి. పక్షులు నిలిచి

బొమ్మలవుతవి. ఆకాశంలో మబ్బులే ఆలకిస్తాయా! తందానా! జయమ్మా!

ఆ అందాలబొమ్మ తుపానుసంగతి వినగానే కాలేజీ నుంచి, అన్నపూర్ణలా వచ్చిపడింది. చిన్నతనంలో కామమ్మా నేడు కామేశ్వరి, స్నేహితురాండ్రకు కాముడు, చుట్టాలకు కామం! తందాన తానా!

ఆ ఖండం అంతా, కాటకంతో మండిపోతోంది. బియ్యం దొరకటంలేదు. జొన్నలు, చోళ్లూ, సజ్జలు, గంటెలు ప్రపంచంలోనే లేవో, అవి ఉద్భవించనేలేదో, అవి కథలలో మాత్రమె కనబడతాయో తందానా! తందానా!

ఎంతమంది తల్లులు తమ తీపుల అడ్డాలబిడ్డలకు ఆకలి తీర్చడానికి పాలులేవని తల్లడిల్లిపోతున్నారో, కుళ్ళిపోతున్నారో, తందానా తానా, తందా...నా!

గ్రామనాయకులు, జిల్లానాయకులు, దేశనాయకులు ఎంత గగ్గోలుపడినా, కంఠాలు బద్దలుకట్టుకొని ఉపన్యాసాలిచ్చినా ధనం ఊడిపడదు, దాక్షిణ్యం తొణికిసలాడదు, ధర్మం ప్రత్యక్షంకాదు, వితరణం అవతరించదండో! తానా తానా, తందానా! తానా తందానా తానా!

అప్పలస్వామిగాదె ఖాళీ అయింది పాత్రల్లు బయట పడినాయి. అప్పలస్వామి స్నేహితులు అరుదైపోయారు; చుట్టాలు చూపులేదు! వక్కాలు పత్తాదొరకరు; మొహమాటస్తులు మొహాలు చాటువేసుకొన్నారండి బాబూ, బాబూ, బాబూ, బంగారుబాబు వినరండో!

ఇంట్లోనగలన్నీ అమ్మాడు; వెండిసామానులమ్మాడు;

భూములు తనఖా పెట్టి, ఈనాములు కుదువపెట్టి. విజయనగరం షావుకార్లను పట్టుకొని, జయ జయ అంటూ దొరికిన జొన్నలు, చోళ్ళు. గంటెలు, సజ్జలు, వరిగెలు పట్టుకువచ్చాడా అభినవ కర్ణుడు, శిబి దధీచి అయిన అప్పలస్వామిగారా ఏమీ చూశారా తందానా తానా।

# 3

కామేశ్వరి విజయనగరం ఉత్తరాలు రాసి తనతో చదివిన స్నేహితురాళ్ళనందరినీ ఒక సంఘంగా కూడమంది, సభ్యురాండ్రను చేర్చమంది, సభలు చేయమంది, చందాలు వసూలుచేయమందీ తండ్రీ తందాన తందానా!

జనాభా ఎక్కువ, ధనాలాతక్కువ; తినడానికి కడుపుల సంఖ్య ఎక్కువ, తేవడానికి గింజలు తక్కువ; చచ్చినవాళ్ళు చచ్చారు. భగవంతుని ఇష్టంలేక చంపగలవారెవరు? చావ గలిగినవారెవరు అని అమ్మలక్కలందరూ వేదాంతాలాడారు, ఓ యమ్మలారా తందానా, తందానా!

తన ఒంటినున్న నగలు రెండువేలరూపాయలు వచ్చినవి; అవన్నీ తండ్రికి ఇచ్చింది కామేశ్వరీదేవి తందానా తందానా!

"ఓ అయ్యా, ఇవి అమ్మి ప్రజలకు పెట్టూ, తిండిలేక మాడుతున్నారు, బీదరైతులకు విత్తనాలకు గింజలులేవు, కూలికి సత్తువలేదు.

"ఏ దేశమో పోయి

ఏదైన తినబోతె

నడచి పోలేరయ్యా
గడచి పోలేరు
"ఆకారమే లేని
ఆ చిన్నికందులకు
పా లెక్కడున్నాయి
బ ట్టెక్కడున్నాది
కళ్లు దించుకుపోవు
తల్లులట వారంత
తల్లి పిల్లలపాలి
దైవ మే డున్నాడు?"

"అయ్యా, నన్ను విజయనగరంపోనీ, ఏమవుతుందో,"
అన్నదండి ఆ అమ్మాయీ కామేశ్వరీదేవి తందానా!

## 4

టిక్కట్టులేకుండా ఆడవాళ్ళపెట్టెలో రైలెక్కిందిం, టిక్కెట్టు తనిఖీదారు టిక్కెట్టడిగాడు.

"లేదండి బాబూ!"

"నీవేషం బాగుంది. చదువుకుంటున్నావా?"

"అవునండి"

"ఏం చదువు?"

"బి యస్. సి."

"వారేవా! నీ పేరు?"

"కామేశ్వరి."

"అల్లో కామేశ్వరీ! మరి డబ్బియ్యి, టిక్కట్టిస్తా!"

"అయ్యా! మా ఊరిలో కాటక దేవత కాలు పెట్టడం చేత, కడుపుకు లేక ప్రజలు మాడడంచేత విజయనగరం పోయి పెద్దలకూ, పిన్నలకూ, ఉద్యోగులకూ, ఊళ్ళేలువారికి, ధన వంతులకూ, ఘనవంతులకూ మనవిచేసి ధనమో ధాన్యమో పనూలుచేద్దామని బయలుదేరానండి" అన్నది కామేశ్వరీ దేపి తందానా!

"టట్, డామిట్, అది కాదమ్మాయి, అందాల పడుచా! నీ మాట ఎవరు వింటారు? రా! నేను పెద్దల నెంద రినో ఎరిగున్నవాణ్ణి, నీకు సహాయం చేయిస్తానన్నాసండీ, టికట్టు కలక్టేరూ తందానా!

"రాజ్యం దివాను నాకెరుక, మహారాజా నాకెరుక, కలక్టరు నాకెరుక, ఖామందు నాకెరుక, సాహుకార్లు నా కెరుక, సంపన్నులు నా కెరుక, నాతో రా, దివానుగారిదగ్గ రకు తీసుకెడతా" నన్నాడండీ టిక్కెట్టు కలక్టేరు తందానా తానా!

రైలు ఆలస్యమై ఆ రోజుసాయంకాలం ఏడుగంటలకు విజయనగరం చేరుకుంది. టికట్టుకలక్టరు కామేశ్వరిని వెంట బెట్టుకొని, ఒక గుర్రంబండి చేయించాడు. వాడిచేతిలో రూపాయిపెట్టాడు. అయిదురూపాయలనోటు పెట్టాడు. అమ్మాయిని ఎక్కమన్నాడు. తా నక్కాడండీ టికట్టు కలక్టేరూ తందానా!

గుర్రం మంచి జాతిది బండివాడు గడుసురకంవాడు. ఛెల్ ఛెల్. పరుగెత్తింది, పట్నంబైటే, రస్తాదారిలో కోట వైపుకే పరుగెత్తిందీ; జాతిగుర్రం సుండీ తందానా!

కోట దాటింది, తోట దాటింది, పొలాలుదాటి విశాఖ పట్నం రోడ్డుపట్టింది. గుఱ్ఱంబండి వేగంగా వెళ్తోంది దౌడు తీస్తోంది గుఱ్ఱం, జాలిగుఱ్ఱమండీ తందానా తానా తందానా!

బూతులుతిట్టూ గుఱ్ఱాన్ని తరుముతున్నాడు బండి వాడు. ఉప్పొంగిపోతున్నాడు టిక్కట్టు కలక్టరు. బలే టిక్కెట్టుకలకటేరు, తందాన తానా!

ఓహో! ఆ కామమ్మకు భయమేసింది. గుండెల్లో దుడుకుపుట్టింది. ఓ కాశీఅన్నపూర్ణా, కంచికామాక్షీ, నన్ను రక్షించుతల్లీ! అని లోన దండలుపెట్టుకుంది. కామేశ్వరమ్మాయి తందానా, తందానానా, తాన తందానానా!

"సార్ ఇంకా దివానుగారిఇల్లు ఎంతదూరం?"

"ఇదిగో వచ్చాం! ఆపు బండీ!"

బండి ఆగింది; బండిదిగాడా టిక్కట్ల ఇనస్పెక్టరు. ఆ అమ్మాయి దిగింది బండి. బండివాడు వెంటనే బండితిప్పి గబగబ వెనక్కితిప్పి విజయనగరందారిపట్టాడు. అది విజయనగరం దగ్గరైనా కాని నిర్జనస్థలం. అమ్మయ్యో, భయమేసింది బంగారుతల్లికి తందానా!

"ఇది ఏమిటండి బాబూ!"

"ఇది తోట. ఆ ప్రక్కనే మేడ, పద, నా చేయి పట్టుకో!"

కాని అమ్మాయి చేయిపట్టుకోలేదు, అతగాడే ఆమె చేయి గబుక్కున పట్టుకొని, ఒక చిటికెలో గద్ద కోడిపిల్లను తన్నుకుపోయినట్లు పొలంలోకి లాక్కుపోయాడు. ఆఅమ్మాయి

భయంచేత "ఓ" యని మూర్ఛపోయింది. మా తల్లి కామే శ్వరి తందానా !

మా బాగుందనుకోని ఆ రాక్షసుడు, రక్తంచరుడు, పిశాచి పొలంలోకి, సొమ్ముమూట ఎత్తుకుపోయే దొంగలా తీసుకుపోయాడు. వాడి బ్రతుకే నీచమైపోనూ తందానా!

ఆ మూర్ఛలాంటి కళ్ళల్లో, ఆమె ఎదుట చిక్కిపోయిన వాళ్లు, పాలులేని పిల్లలు, పంటలులేని రైతులు చేతులు చాచి కనబడ్డారు, మా తల్లి కామేశ్వరీదేవి కోయమ్మా తందానా!

ఒక్కసారిగా ఆ అమ్మాయికి మెలకువవచ్చింది. ఓ శక్తి అయ్యిందండి. ఏలా విదిలించుకొందో వాడికౌగిలింత, కిందికి ఉరికింది. వాణ్ణి సాగదీసి లెంపకాయకొట్టి, ఆ పొలాలలో, గోతుల్లో, లేడిలా పరుగెత్తింది. వెనక వాడు, ముందు, ఆమె దడదాడ దడదాడ తందానా తందానా తాన తాన తాన తందానా!

ఆమెని, ఆ రాక్షసు డందుకోలేకపోయాడు. ఒక రాయి తగిలి పడ్డాడు. ఆమె రోడ్డుమీదికి ఉరికిందండీ తందానా !

ఇంతలో కారులైట్లు. కారు ఆగి ఒక పెద్దమనిషి దిగి "ఎవరమ్మా మీ" రన్నాడు దేవుడై అతడూ తందానా !

"అయ్యా రక్షించండి, ఆ రాక్షసుడు రైలు...... టిక్కెట్లు-దివాను-ఇల్లు-ఇక్కడికి అన్నాడు" అంది వగరుస్తూ మా తల్లి కామేశ్వరి తందానా !

"అమ్మా నీ పేరు?

"కా...కా...కామేశ్వరండి."

"తల్లీ నువ్వా! నేనే దివానును. నీ ఉత్తరం అందింది, పక్కవూళ్ళో పనిఉండి, నువ్వు వస్తానని తొందరగా వస్తున్నా రైతుబిడ్డా, రా తల్లీ! ఈ కారు ఎక్కమ్మా చందాలు పది వేలు వసూలుచేసెదము జమీంవారు పది వేలమ్మా" అన్నాడండి. ఆ అమ్మాయి తియ్యటి మూర్ఛపోయిందండీ తందానా తందానా! జై జై జై జై! తందాన తాన!

కథ కంచికి మనం హైదరాబాదండీ తాన తాన తందనాన తానా!